సాక్షి కామారెడ్డి

మంగళవారం । 21 । ఫిబ్రవరి । 2023



ప్రజావాణికి 64 వినతులు..

కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 64 ఫిర్యాదులు నమోదయ్యాయి. అదనపు కలెక్టర్ చంద్రమోహన్ వినతులు స్వీకరించారు.

- 8లో ▸



హన్మాజీపేట్‌లో ఉద్రిక్తత

హన్మాజీపేట్‌లో బీజేపీ నిర్వహిస్తున్న స్ట్రీట్ కార్నర్ సమావేశాన్ని బీఆర్ఎస్ నాయకులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.1 /13.6

ఉదయం మంచు కురుస్తుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి చలిగాలులు వీయవచ్చు.

న్యూస్‌రీల్

న్యూట్రిషన్ కిట్‌ల పంపిణీ



సాక్షి ఎఫెక్ట్..

కామారెడ్డి టౌన్: జిల్లాలోని గర్భిణులకు సోమవారం న్యూట్రిషన్ కిట్‌లను పంపిణీ చేశారు. న్యూట్రిషన్ కిట్ల సరఫరాలో తీవ్ర జాప్యం జరగడంతో ఇటీవల 'సాక్షి' కథనాన్ని ప్రచురించిన విషయం తెలిసిందే. దీనిపై అధికారులు స్పందించారు. సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు జిల్లా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో అధికారులు న్యూట్రిషన్ కిట్లను తెప్పించి, సోమవారం పంపిణీ చేశారు. జిల్లాలో 6 వేలకుపైగా గర్భిణులకు కిట్లను పంపిణీ చేయాల్సి ఉంది. అర్హులందరికీ కిట్‌లను అందించాలని గర్భిణులు కోరుతున్నారు.

ఏఐసీసీ మెంబర్‌గా షబ్బీర్ అలీ



సాక్షి, కామారెడ్డి: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సభ్యుడిగా జిల్లాకు చెందిన మాజీ మంత్రి షబ్బీర్ అలీకి అవకాశం లభించింది. ఆయన జిల్లా కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుడు. రెండుసార్లు ఎమ్మెల్యే అయిన ఆయన.. మంత్రిగానూ పనిచేశారు.

నియోజకవర్గ ఇన్‌చార్జీలు..

హాథ్ సే హాథ్ జోడో అభియాన్ అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జీలను నియమించారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజక వర్గాలకు చిలుక మధుసూదన్‌రెడ్డి, బాన్సువాడకు ఏ.మధుసూదన్‌రెడ్డి, జుక్కల్‌కు దుర్గం భాస్కర్‌లను నియమించారు.

నేడు స్మితా సబర్వాల్, శ్వేతా మహంతిల రాక


కామారెడ్డి టౌన్: సీఎం కార్యాలయ కార్యదర్శి స్మితా సబర్వాల్ మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఆమెతోపాటు వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శ్వేతా మహంతి, వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ పద్మజ, రాష్ట్ర అధికారులు రానున్నారు. వారు ఉదయం 11.15 గంటలకు భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, గర్భిణులకు న్యూట్రిషన్ కిట్ పంపిణీ చేస్తారని జిల్లా అధికారులు తెలిపారు. అనంతరం వైద్య సేవలపై సమావేశం నిర్వహిస్తారన్నారు. మధ్యాహ్నం 12.15 గంటలకు భిక్కనూరులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, 1.15 గంటలకు జిల్లా కేంద్రంలోని 23వ వార్డులో గల ఎంపీపీఎస్ పాఠశాలలను సందర్శిస్తారని పేర్కొన్నారు. అదే వార్డులో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని తనిఖీ చేసి, సేవలపై సమీక్షిస్తారని తెలిపారు.

దీక్ష విరమించిన సిర్‌పూర్‌వాసి




మద్నూర్: డోంగ్లీ మండలంలోని సిర్‌పూర్ గ్రామంలో గ్రామ పెద్దల ఇష్టారాజ్యం నడుస్తోందంటూ ఐదు రోజులుగా దీక్ష చేస్తున్న లక్ష్మణ్.. సోమవారం దీక్ష విరమించాడు. గ్రామంలో అభివృద్ధి పనులు జరగడం లేదని, పెద్దల ఇష్టారాజ్యం నడుస్తోందని హనుమాన్ ఆలయం వద్ద లక్ష్మణ్ అనే యువకుడు దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. డోంగ్లీ తహసీల్దార్ క్రాంతికుమార్ సోమవారం సిర్‌పూర్ గ్రామానికి వెళ్లి యువకుడితో మాట్లాడారు. యువకుడు చెప్పిన విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో లక్ష్మణ్ దీక్ష విరమించాడు.

సౌత్‌క్యాంపస్ ప్రిన్సిపాల్‌గా కవిత తోరన్



భిక్కనూరు: భిక్కనూరులోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్ ప్రిన్సిపాల్‌గా కవిత తోరన్‌ను నియమితులయ్యారు. సోమవారం ఆమెకు తెలంగాణ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ రవీందర్‌గుప్తా నియామక పత్రాన్ని అందించారు. ఆమెను అధ్యాపకులు సుధాకర్‌గౌడ్, మోహన్‌బాబు, ప్రతిజ్ఞ, యాలాద్రి, నారాయణ, శ్రీకాంత్ సునీత, వైశాలి, సరిత, రమాదేవి అభినందించారు.

బండొకరిది.. ఫైనొకరికి..



Traffic Violation Details

ఓవర్ స్పీడ్‌తో వెళ్లిన కారు.. బైక్‌కు పడిన జరిమానా

- ట్రాఫిక్ ఉల్లంఘనల కింద ఎడాపెడా ఈ–చలానాలు
- రోడ్డెక్కకున్నా జరిమానాలు
- తప్పు చేయకపోయినా ఫైన్‌లు
- ఇబ్బందిపడుతున్న వాహనదారులు

✧ సదాశివనగర్‌కు చెందిన నర్సింలు కామారెడ్డి పట్టణానికి వెళ్లలేదు. కానీ ఆయన హెల్మెట్ ధరించకుండా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించాడంటూ ఈ–చలాన్ మెస్సేజ్ వచ్చింది. దీంతో స్థానిక పోలీసు స్టేషన్‌కు వెళ్లి గోడు వెళ్లబోసుకున్నాడు.

✧ కామారెడ్డి పట్టణంలోని ధర్మశాల ప్రాంతంలో బైకుపై ఇద్దరు వెళ్తుండగా.. ట్రిపుల్ రైడింగ్ అని రూ. 1,200 జరిమానా విధించారు. ఇద్దరే ఉన్నట్టు ఫొటోలో స్పష్టంగా కనిపిస్తున్నా ఫైన్ వేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.



హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారుడు



చలానా జారీ అవుతున్న సంజీవులుకు చెందిన బైక్

✧ బాన్సువాడ మండలం బోర్లం క్యాంపునకు చెందిన ఎంబరి సంజీవులుకు ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘనలకు సంబంధించి ఇప్పటి వరకు నాలుగు ఫైన్లు పడ్డాయి. ట్రిపుల్ రైడింగ్ అంటూ రూ.1,200 ఒకసారి, హెల్మెట్ ధరించలేదంటూ మూడుసార్లు జరిమానాలు విధించారు. అయితే ఆయన బైకు కలర్, జరిమానాలు పడుతున్న బైకు కలర్ వేరుగా ఉండడం గమనార్హం. నాలుగు చలానాల్లో ఏ ఒక్కటీ తన బైక్‌ది కాదని, వేరే వ్యక్తులకు సంబంధించిన ఫైన్ తనకు వస్తోందని బాధితుడు తెలిపారు.



✧ కామారెడ్డి పట్టణానికి చెందిన ఓ కారు ఓనర్‌కు ట్రాఫిక్ ఉల్లంఘన కింద జరిమానా వచ్చింది. వాస్తవంగా చలానా విధించిన రోజున ఆయన తన కారు తీసుకుని ఎక్కడికీ వెళ్లలేదు. బైకు ట్రాఫిక్ ఉల్లంఘనకు సంబంధించి జరిమానా మెస్సేజ్ కారు యజమానికి వచ్చింది.

✧ బాన్సువాడ మండలం బోర్లం క్యాంపునకు చెందిన ఓ వ్యక్తికి ట్రాఫిక్ ఉల్లంఘన కింద జరిమానా మెస్సేజ్ వచ్చింది. వాస్తవంగా బైకు నంబరు తప్పుగా నమోదు చేయడంతో ఈయనకు జరిమానా పడింది. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించకపోయినా జరిమానా చెల్లించాల్సి వస్తోందని బాధితుడు పేర్కొన్నాడు.

సాక్షి, కామారెడ్డి: జిల్లాలో ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసు శాఖ సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటోంది. జిల్లా కేంద్రంలో ఎక్కువ రిజల్యూషన్ ఉన్న కెమెరాలను ఏర్పాటు చేసింది. వాటిని జిల్లా పోలీసు కార్యాలయానికి అనుసంధానం చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. అలాగే ఇతర పట్టణాలు, మండల కేంద్రాల్లోనూ ట్రాఫిక్ ఉల్లంఘనలపై సీరియస్‌గానే వ్యవహరిస్తున్నారు. అయితే ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించి తీస్తున్న ఫొటోల ఆధారంగా ఈ చలానాలు పంపే క్రమంలో పొరపాట్లు జరుగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఒకరికి బదులు మరొకరికి జరిమానాలు పడుతున్నాయి. ట్రాఫిక్ ఉల్లంఘించింది ఒక బైకు అయితే మరో బైకు యజమానికి జరిమానా పడుతోంది. కొన్ని సందర్భాల్లో నంబర్లు నమోదు చేయడంలో జరుగుతున్న పొరపాట్లతో వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ–చలానా జారీ చేసే సమయంలో క్షుణ్ణంగా పరిశీలించకుండా జరిమానాలు విధిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. రోడ్డు మీద వెళ్తున్న వాహనం ఒకటైతే, మరో వాహనానికి జరిమానా పడడం విస్మయం కలిగిస్తోంది.

నంబర్లు మారుస్తున్న ఘనులు

ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించి పోలీసు శాఖ జరిమానాలు విధిస్తుండడంతో కొందరు వాహనదారులు అతి తెలివితో తమ వాహనాల నంబర్లను మారుస్తున్నారు. దీంతో తమకు పడాల్సిన జరిమానాలు వేరే వాళ్లకు వెళ్తున్నాయి. కొన్ని సందర్భాల్లో పోలీసులు ఈ–చలానాపై నంబర్ మిస్టేక్‌తో వేస్తుండగా, మరికొన్ని చోట్ల ఉల్లంఘనులు అతి తెలివి ప్రదర్శించి తమ వాహన నంబరు పూర్తిగా కనిపించకుండా చేయడం, అక్షరాలు, అంకెలు మారుస్తుండడంతో వేరే వాళ్లు ఇబ్బందిపడాల్సి వస్తోంది. పెండింగ్ చలానాల విషయంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేసినపుడు తమ బైకులపై ఉన్న జరిమానాలు తెలుసుకుని యజమానులు కంగుతింటున్నారు. సీసీ కెమెరాల ద్వారా ట్రాఫిక్ ఉల్లంఘనలకు ఈ–చలానాలు జారీ చేసే సమయంలో పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించాలని వాహనదారులు కోరుతున్నారు.

అలాగే కొన్ని సందర్భాల్లో బైకుకు బదులు కారుకు, కారుకు బదులు బైకుకు జరిమానా పడుతోంది. అలాగే బైకుపై ఇద్దరు ఉన్నా ముగ్గురు వెళ్తున్నట్టు ట్రిపుల్ రైడింగ్ పేరుతోనూ జరిమానాలు విధిస్తున్నారు. స్క్రీన్ మీద సరిగ్గా చూసుకోకుండా జరిమానాలు విధిస్తున్నారని దీని ద్వారా స్పష్టమవుతోంది. చాలా మంది వాహనదారులు రోడ్డుపైకి వెళ్లకున్నా, వారికి జరిమానాలు పడుతుండడంతో ఆందోళన చెందుతున్నారు.

'భూగర్భ జలాలను పెంపొందించాలి'

కామారెడ్డి టౌన్: ఉపాధి హామీ పథకం ద్వారా ఊట చెరువులు, ఫాం పాండ్స్ నిర్మాణం చేపట్టి భూగర్భ జలాలను పెంపొందించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం మండల స్థాయి అధికారులతో పోడు భూములు, దళిత బంధు, ఉపాధి హామీ పథకం, ధరణి పోర్టల్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీలో కూలీల సంఖ్యను పెంచాలన్నారు. పోడు భూముల ఎంపిక సజావుగా చేపట్టాలన్నారు. ధరణి పోర్టల్‌లో మ్యుటేషన్లు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రమోహన్, వెంకటేశ్ ధోత్రే, డీఆర్‌డీవో సాయన్న, ఆర్డీవోలు శ్రీనివాస్‌రెడ్డి, శీను తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులతో మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్

భిక్కనూరు: ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారంతో ఎంతో మేలు కలుగుతుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిని, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణులు బరువు, హిమోగ్లోబిన్ పెరగడానికి తీసుకుంటున్న చర్యలు గురించి తెలుసుకున్నారు. న్యూట్రిషన్ కిట్ల వినియోగంతో జరిగిన మేలు గురించి వివరాలు నమోదు చేసుకున్నారు. మంగళవారం భిక్కనూరు ప్రభుత్వాస్పత్రిని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శ్వేతా మహంతి సందర్శించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు ఇంకా ఏమేం అవసరమో గుర్తించాలని ఆయన వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. ఆయన వెంట సర్పంచ్ వేణు, ఉప సర్పంచ్ బోడ నరేశ్, తహసీల్దార్ ప్రేమ్ కుమార్, ఎంపీడీవో అనంత్‌రావు, ఎంపీవో ప్రవీణ్ కుమార్, వైద్య సిబ్బంది ఉన్నారు.

పొదుపు డబ్బులు మింగేశారు

- చేతివాటం ప్రదర్శించిన సీఎస్పీ నిర్వాహకులు
- ఆందోళనకు దిగిన మహిళలు



మహిళలతో మాట్లాడుతున్న ఐకేపీ ఏపీఎం రాంనారాయణగౌడ్

నిజాంసాగర్: మహిళా సంఘాల సభ్యుల పొదుపు డబ్బులను కస్టమర్ సర్వీస్ సెంటర్ నిర్వాహకులు మింగేశారు. దీంతో మహిళలు ఆందోళనకు దిగారు. వివరాలిలా ఉన్నాయి. హసన్‌పల్లికి చెందిన 11 స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణాలు పొందారు. తీసుకున్న డబ్బులను నెలనెలా చెల్లించడానికి మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంకుకు వచ్చేవారు. బ్యాంకులో రద్దీ కారణంగా స్త్రీనిధి, బ్యాంకు అధికారుల సహకారంతో కస్టమర్ సర్వీస్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. కస్టమర్ సర్వీస్ ఆన్‌లైన్ పాయింట్ నిర్వాహకులు మహిళలనుంచి డబ్బులు తీసుకుని వారి ఖాతాల్లో జమ చేస్తున్నారు. హసన్‌పల్లికి చెందిన మహిళలు సీఎస్పీ పాయింట్‌కు వచ్చి నెలనెలా డబ్బులు చెల్లించారు. అయితే సీఎస్పీ నిర్వాహకులు ఆ డబ్బులను మహిళా సంఘాల ఖాతాలలో జమ చేయకుండా నొక్కేశారు. 11 సంఘాలకు సంబంధించి రూ. 36 లక్షలు తేడా రావడంతో మహిళలు ఇటీవల ఆందోళనకు దిగారు. దీంతో 3 సంఘాలకు రూ. 10 లక్షలు చెల్లించారు. మరో 8 సంఘాలకు సంబంధించి రూ. 26 లక్షలు రావాల్సి ఉంది. దీంతో సోమవారం నిజాంసాగర్‌లో ఆందోళన చేశారు. ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకులు, బ్యాంకు, ఐకేపీ అధికారులను నిలదీశారు. ఈ విషయమై ఐకేపీ ఏపీఎం రాంనారాయణగౌడ్‌ను సంప్రదించగా.. మహిళలు నెలనెలా డబ్బులు పొదుపు చేసినట్లు రసీదులు ఉన్నాయని, మినిట్స్ బుక్కులు, రిజిస్టర్లల్లో నమోదు చేశారని పేర్కొన్నారు. ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకులు దుర్వినియోగం చేసిన డబ్బుల విషయమై బ్యాంకు, స్త్రీనిధి అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు విచారణ చేపట్టి ఆన్‌లైన్ సెంటర్‌ను మూసి వేశారన్నారు. ఏపీఎం సూచనతో హసన్‌పల్లి సర్పంచ్ సంగమేశ్వర్‌గౌడ్, నాయకులు గుండయ్య, ఊషయ్యతో కలిసి మహిళలు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఆన్‌లైన్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని కోరారు.



ఎల్లారెడ్డిలో ఎరువుల కోసం బారులు తీరిన రైతులు

ఎరువుల కోసం బారులు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో ఎరువుల కొరత ఏర్పడింది. దీంతో ఎరువుల కోసం రైతులు ప్రైవేటు దుకాణాల ముందు బారులు తీరారు. సోమవారం పట్టణంలోని ఓ దుకాణం వద్ద యూరియా కోసం బారులు తీరారు. సొసైటీలలో యూరియా లేకపోవడంతో ప్రైవేటు దుకాణాలను ఆశ్రయించాల్సి వస్తోందని రైతులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి కొరత తీర్చాలని కోరారు.

రేపటి నుంచి డీఈఐఈడీ పరీక్షలు

కామారెడ్డి టౌన్: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఐఈడీ) మొదటి సంవత్సరం పరీక్షలను ఈనెల 22వ తేదీనుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని డీఈవో రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవునిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని, విద్యార్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందే చేరుకోవాలని తెలిపారు. హాల్ టికెట్‌లను bse.telangana.gov.in వెబ్‌సైట్‌నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

'సమస్యల పరిష్కారానికి కృషి'



సంజీవయ్యను సన్మానిస్తున్న అధ్యాపకులు

కామారెడ్డి అర్బన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంజీవయ్య పేర్కొన్నారు. సోమవారం కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో అధ్యాపకుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సంజీవయ్య, సంఘం ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి మాట్లాడారు. కామారెడ్డి కళాశాల న్యాక్ ఏ గ్రేడ్ సాధించిన సందర్భంగా ప్రిన్సిపాల్ కిష్టయ్య, ఐక్యూఏసీ సమన్వయకర్త రామకృష్ణను అభినందించారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి రమేష్‌గౌడ్, కరీంనగర్, వరంగల్, ములుగు జిల్లాల అధ్యక్షులు, శ్రీనివాస్, రవికుమార్, రామకృష్ణారెడ్డి, యూనివర్సిటీల సమన్వయకర్తలు చిన్న, గణేష్, రాంభాస్కర్, గులాం ముస్తఫా, జయప్రకాష్, శ్రీనివాస్‌రావు, లక్ష్మణ్‌చారి, శరత్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అంతిమ భారం తగ్గించండి

- బల్దియాకు ప్రజల వినతి
- రెండు రోజుల్లో పరిష్కరిస్తామన్న పాలకవర్గం
- 'సాక్షి' కథనంపై ప్రత్యేక చర్చ



కౌన్సిల్ హాల్‌లో చర్చిస్తున్న కుల సంఘాల ప్రతినిధులు, బల్దియా పాలకవర్గం

కామారెడ్డి టౌన్: పేదోడికి బతుకే కాదు.. చావు కూడా భారంగా మారిందని, అంతిమ సంస్కార ఖర్చులు అడ్డగోలుగా పెరగడంతో ఇబ్బందిపడుతున్నామని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. అంత్యక్రియల భారం తగ్గించేందుకు బల్దియా చర్యలు తీసుకోవాలని కోరారు. 'ఆ'ఖరీదు' మజిలీ' శీర్షికన ఈనెల 11న 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే.. ఈ కథనం బల్దియా పాలకవర్గంతోపాటు పట్టణ ప్రజలను కదిలించింది. ఈ నేపథ్యంలో సోమవారం కామారెడ్డి బల్దియా ఆధ్వర్యంలో కౌన్సిల్ హాల్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ దేవేందర్, అధికారులు, బీఆర్ఎస్ సీనియర్ నేత నిట్టు వేణుగోపాల్‌రావు, కౌన్సిలర్‌ల సమక్షంలో జరిగిన సమావేశంలో పట్టణంలోని కుల సంఘాల సభ్యులు పాల్గొని చర్చించారు. మరణించిన రోజునుంచి దినకర్మలు పూర్తయ్యేవరకు అయ్యే ఖర్చులపై మాట్లాడారు. వ్యక్తి చనిపోవడంతో కుటుంబ సభ్యులు ఏడుస్తుంటే.. అంతిమ సంస్కారాలకు అడ్డగోలుగా డబ్బులు వసూలు చేస్తూ మరింత ఏడిపిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. అంతిమ సంస్కారాలు, దిన కర్మలకు సంబంధించిన పనులపై ఓ నిర్ణయం తీసుకుని ధరల పట్టిక రూపొందించాలని కోరారు. అన్ని సంఘాల ప్రతినిధులతో మాట్లాడి రెండు మూడు రోజుల్లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని బల్దియా పాలకవర్గం హామీ ఇచ్చింది. సమావేశంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్, కౌన్సిలర్లు కృష్ణమోహన్, నరేందర్, పిట్ల వేణు, రెవెన్యూ, పోలీస్‌శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధరల పట్టిక ఏర్పాటు చేయాలి



అంతిమ సంస్కారానికి సంబంధించిన ఖర్చులు ఇబ్బంది పెడుతున్నాయి. పేదలను దృష్టిలో ఉంచుకుని అంత్యక్రియలకు సంబంధించిన ఖర్చులపై ధరల పట్టిక రూపొందిస్తే బాగుంటుంది.

– ఆర్.సాయిలు, మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు

రూ. 30 వేలపైనే..



కులంలో ఎవరైనా చనిపోతే కుల సంఘం ఆధ్వర్యంలో అంత్యక్రియల ఏర్పాట్లు చేస్తున్నాం. అంతిమ సంస్కార ఖర్చులు రూ. 30 వేలకుపైగా అవుతున్నాయి. బొంద తవ్వడానికే రూ. 6 వేలపైన అడుగుతున్నారు. ఇది దారుణం.

– ఎస్.నారాయణ, మేరు సంఘం అధ్యక్షుడు

శవాల ముందే పీక్కుతింటున్నారు



శ్మశాన వాటికలో కొందరు పని చేయకున్నా డబ్బుల కోసం మృతుల కుటుంబ సభ్యులు, కుల పెద్దలను పీక్కుతింటున్నారు. పాడెపై పడుకుని మరీ వేలాది రూపాయలు డిమాండ్ చేస్తున్నారు. ఇది సరికాదు.

– జి.లక్ష్మీనారాయణ, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు

కరీంనగర్ మాదిరిగా..



అంత్యక్రియలు ఎంత భారంగా మారుతున్నాయో 'సాక్షి'లో ప్రచురితమైన కథనం చూసి చలించిపోయాం. కరీంనగర్ కార్పొరేషన్‌లో మాదిరిగా ఇక్కడా ఒక్క రూపాయికి అంతక్రియలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి.

– చక్రం, యువజన స్వర్ణకార సంఘం అధ్యక్షుడు

బల్దియా ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయాలి



పట్టణంలో ఉన్న శ్మశాన వాటికల వద్ద సౌకర్యాలు కల్పించాలి. మున్సిపాలిటీ తరపున ప్రత్యేకంగా అంతిమ సంస్కార వాహనాలు, పాడె సామగ్రి అందుబాటులో ఉంచితే పేదలపై భారం తగ్గుతుంది.

– నర్సాగౌడ్, గౌడ సంఘం ప్రతినిధి

అప్పులు చేయాల్సి వస్తోంది



పట్టణంలో అంత్యక్రియల ఖర్చులు తడిసిమోపెడు అవుతున్నాయి. దీంతో పేద, మధ్యతరగతి అప్పులు చేయాల్సి వస్తోంది. బాధాకర పరిస్థితుల్లో ఉన్నవారిని ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

– బీఎంఎస్‌పీ భద్రయ్య, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు

కాటికాపరులను అదుపులో ఉంచాలి



అంతిమ సంస్కారం కోసం అడ్డగోలుగా ఖర్చు అవుతున్నాయి. కాటి కాపరులు ఇష్టారాజ్యంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. వారిని అదుపులో ఉంచాలి. ధరల పట్టిక రూపొందించి, అమలు చేయాలి.

– మర్కంటి శ్రీనివాస్, స్వర్ణకార సంఘం అధ్యక్షుడు

క్లుప్తంగా

పీజీ సెమిస్టర్ పరీక్ష తేదీల్లో మార్పు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 24న ప్రారంభం కావాల్సిన పీజీ మొదటి, మూడు, ఐదు, ఏడు, తొమ్మిదో సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేసినట్లు కంట్రోలర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ ఎంసీఏ, ఎంబీఏ, ఎల్ఎల్ఎం, ఎల్ఎల్బీ కోర్సులకు సంబంధించి మొదటి, మూడో సెమిస్టర్స్, ఎల్ఎల్బీ, ఐఎంబీఏ కోర్సులకు సంబంధించి 5, 7, 9వ సెమిస్టర్ పరీక్షలు మార్చి 8వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు.

కవితలకు ఆహ్వానం

బోధన్: ఉగాది సందర్భంగా పంపా సాహితీ పీఠం బోధన్ ఆధ్వర్యంలో పంపా తరంగాలు కవిత సంకలనం పుస్తకాన్ని ముద్రించనున్నట్లు పీఠం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పురాణి అజయ్ కుమార్, పబ్బ మురళి ప్రకటనలో తెలిపారు. ఈ సంకలనానికి జిల్లాలోని కవులు, రచయితల నుంచి కవితలు, పద్యాలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. భారతీయ సంస్కృతి, ఆచారాలు సంప్రదాయాలు, భాషలు అంశాలపై 20 పంక్తులకు మించకుండా కవితలు, పద్యాలను ఈ నెల 28 వరకు 9441471400 నంబర్‌కు వాట్సాప్‌లో పంపాలని కోరారు. కవితతో పాటు ఫొటో, హామీ పత్రం జత చేయాలని సూచించారు. వివరాలకు 9440181487 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

నేడు సైన్స్ ప్రతిభ పరీక్ష

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి భౌతిక రసాయనశాస్త్ర ప్రతిభ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎఫ్‌పీఎస్‌టీ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు శివప్రసాద్, రఘునాథ్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని వివిధ మండలాల్లో ఎంపికైన విద్యార్థులు జిల్లాస్థాయి టాలెంట్ టెస్టులో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన వారిని రాష్ట్ర స్థాయికి పంపుతామన్నారు.

టీఎన్జీవోస్ క్రీడల కరపత్రాలు ఆవిష్కరణ



నిజామాబాద్‌నాగారం: టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ఉద్యోగులకు క్రీడలు నిర్వహిస్తున్నట్లు ఉద్యోగ జేఏసీ జిల్లా చైర్మన్ అలుక కిషన్ అన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 21 నుంచి 25 వరకు జిల్లా స్థాయి పోటీలు ఉంటాయన్నారు. సోమవారం క్రీడల కరపత్రాలను ఆవిష్కరించారు. క్రీడల ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కవిత, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్యేలు హాజరవుతున్నట్లు తెలిపారు.

పోలీసుల చేతివాటం!

- ఫైనలిస్తేనే మృతదేహానికి పంచనామా
- బాధితుల నుంచి వసూళ్లు
- వివాదాస్పదంగా ఖాకీల తీరు



బాన్సువాడ పోలీస్ స్టేషన్

బాన్సువాడటౌన్: అసలే తమ వారు మృతి చెంది బాధలో ఉన్న వారిని కొందరు పోలీసులు మరింత ఇబ్బంది పెడుతున్నారు. పంచనామా చేయడానికి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఏ మృతదేహానికి పంచనామ చేయాలన్నా రూ.2500 ఇవ్వాల్సిందే. కాదు కూడదంటే పంచనామ ఆలస్యం అవుతుంది అని బెదిరిస్తున్నారు. ఇటీవల ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకుంటే పోస్టుమార్టం కోసం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. పంచనామ చేసి రిపోర్టును నమోదు చేయాల్సిన ఖాకీలు కాసుల వేటలో పడ్డారు. రూ.2500 ఇవ్వాలని పట్టుపట్టారు. బీర్కూర్ మండలానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి ఫోన్ చేసి వారికి డబ్బులు అడుగవద్దని చెప్పినా వదిలిపెట్టలేదు. వారు పేదవారు కావడంతో బతిమిలాడితే రూ.250 తగ్గించారు. దీంతో చేసేదేమి లేక బాధితులు రూ.2250 ఇచ్చి పంచనామ చేయించి తీసుకెళ్లారు. ఇలా ఒక్కో కేసుకు ఒక్కో రీతిలో పోలీసులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. బాన్సువాడ పోలీస్ స్టేషన్ పరిధిలో గత నెలలో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. హత్య చేసింది అతని భార్యనే. మృతుడి తోబుట్టువులు తమ అన్నను చంపింది వదినేనని ఫిర్యాదు చేశారు. అదే రోజు పోలీసులు హతుడి భార్యను విచారించగా తన భర్తను తానే హత్య చేశానని ఒప్పుకుంది. ఆస్తిని తన భర్త తోబుట్టువులకు రాసి ఇస్తానని గొడవ పడడంతో రోకలి బండతో కొట్టి చంపానని అంగీకరించింది. విచారణ పేరిట పోలీసులు నిందితురాలిని వారం పాటు స్టేషన్‌లో ఉంచిన తర్వాతనే రిమాండ్‌కు పంపారు. వారం రోజుల పాటు నిందితురాలు పోలీస్టేషన్‌లో ఉండటంపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాన్సువాడలో భారీ మొత్తంలో బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. బాధితులు నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ చోరీకి పాల్పడ్డాట్లు పోలీసులు నిర్ధారించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో కూడా బాధితుల నుంచి భారీ మొత్తంలో వసూలు చేసినట్లు సమాచారం.

అక్రమ ఇసుక రవాణా కింది స్థాయి పోలీసు సిబ్బందికి కాసుల కురిపిస్తోంది. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఏర్పాటు చేసిన సిబ్బంది మామూలుగా తీసుకుంటుండడంతోనే ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. ఇసుక రవాణా చేసే వారి నుంచి రూ.వేల కొద్దీ వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పై స్థాయి అధికారులు నిక్కచ్చిగా వ్యవహరిస్తున్నా కింది స్థాయి సిబ్బంది చేతివాటంతో మూడు ట్రిప్పులు, ఆరు దంపులుగా ఇసుక దందా కొనసాగుతోంది. నిత్యం పోలీస్ స్టేషన్ ముందు నుంచే అక్రమంగా ఇసుక తరలిపోతున్న పోలీసులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల బీర్కూర్ మండలంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు అటుగా వెళ్తున్న కలెక్టర్ వాహనానికి సైతం దారి ఇవ్వలేదు. కలెక్టర్ స్థానిక రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో అధికారులు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి

తెయూ(డిచ్‌పల్లి): మానవ అక్రమ రవాణాను అరికట్టడం ప్రతి ఒక్కరు తమవంతు బాధ్యతగా భావించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ రిసోర్స్ పర్సన్ షాబిన్ అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ న్యాయ కళాశాలలో సోమవారం నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (ఎన్ఏఎల్ఎస్ఏ), డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (డీఎల్ఎస్ఏ), తెలంగాణ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 'మానవ అక్రమ రవాణా' అనే అంశంపై న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ.. ప్రతిరోజూ జరిగే మానవ అక్రమ రవాణాలో 70శాతం మంది మహిళలు, బాలికలు, చిన్నారులు ఉంటున్నారని తెలిపారు. మహిళలు, బాలికలను లైంగిక దోపిడికి గురి చేస్తున్నారని, పిల్లలను వికలాంగులుగా మార్చి భిక్షాటన, ఇళ్లల్లో బానిసలుగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మానవ అక్రమ రవాణా, మహిళలు, చిన్నారులపై లైంగిక దోపిడి నుంచి రక్షణ పొందటానికి ఉన్న చట్టాలు, వాటి ప్రాముఖ్యత గురించి ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ రిసోర్స్ పర్సన్స్ శేరోన్ డానియల్, కరుణాకర్, షాబిన్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లా కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రసన్నరాణి, హెచ్‌వోడీ స్రవంతి, అధ్యాపకులు నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్యాంపస్‌లో అంతర్జాతీయ సదస్సు



సదస్సు ఆహ్వాన పత్రాన్ని వీసీ రవీందర్‌కు అందజేస్తున్న కోఆర్డినేటర్ ప్రవీణ్, అధ్యాపకులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ బయో టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు (21, 22, 23వ తేదీల్లో) అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ప్రారంభ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ రిక్క లింబాద్రి హాజరవుతారని, వీసీ డి రవీందర్ అధ్యక్షత వహిస్తారని సదస్సు కోఆర్డినేటర్ ప్రవీణ్ మామిడాల తెలిపారు. అధ్యాపకులు, విద్యార్థులు ఈ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సోమవారం సదస్సు ఆహ్వానపత్రాన్ని కోఆర్డినేటర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో విభాగం అధ్యాపకులు వీసీ రవీందర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధిని, అధ్యాపకులు కిరణ్మయి, జవేరియా ఉజ్మా, ప్రసన్న శీల, పీఆర్‌వో జమీల్ అహ్మద్ పాల్గొన్నారు.

హన్మాజీపేట్‌లో ఉద్రిక్తత

- స్ట్రీట్‌కార్నర్ మీటింగ్‌ను అడ్డుకున్న బీఆర్ఎస్ శ్రేణులు



బాన్సువాడరూరల్: బాన్సువాడ మండలం హన్మాజీపేటలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. సోమవారం గ్రామంలో బీజేపీ నాయకులు నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌ను బీఆర్ఎస్ నాయకులు అడ్డుకున్నారు. పోచారంను విమర్శిస్తే సహించేది లేదని తేల్చిచెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు బాహాబాహికి దిగడంతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళన కారులను శాంతింపచేశారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, నాయకులు మల్యాద్రి రెడ్డి, కొత్తకొండ భాస్కర్ తదితరులు కాసేపు మాట్లాడి సభను ముగించారు. బీఆర్ఎస్ నాయకులు తమ సభలను అడ్డుకుని, భౌతికదాడులకు పాల్పడటం అప్రజాస్వామిక చర్య అని బీజేపీ నాయకులు అన్నారు.

'కేసీఆర్‌ను గద్దె దించాలి'

ఖలీల్‌వాడి: సీఎం కేసీఆర్‌ను గద్దెదించే వరకు బీజేపీ కార్యకర్తలు పోరాడాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. సోమవారం నగరంలోని కంఠేశ్వర్ గోదాంరోడ్డులో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బూత్ స్థాయి కార్యకర్తలే బీజేపీకి బలమన్నారు. నిజామాబాద్ కోసం బిగాల గణేశ్‌గుప్తా ఏం చేశారని ప్రశ్నించారు. గంగాధర్, రోషన్‌లాల్ బోర, లక్ష్మీనారాయణ, శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రజావాణికి 64 వినతులు



ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

కామారెడ్డి క్రైం: ప్రజావాణి ఫిర్యాదులను వెంటవెంటనే పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 64 ఫిర్యాదులు వచ్చాయి. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. శిక్షణ కలెక్టర్ శివేంద్రప్రతాప్, డీఆర్‌డీఓ సాయన్న, పర్యవేక్షకుడు సాయి భుజంగరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇతరుల పేరు మీద భూమి చూపుతోంది

తన తల్లి పేరిట ధరణిలో భూమికి సంబంధించిన రికార్డులను సరిచేయాలని కోరుతూ దేవునిపల్లికి చెందిన వడ్ల సురేష్ ప్రజావాణికి ఫిర్యాదు చేశాడు. రామారెడ్డి మండలం రెడ్డిపేటలో తన తల్లి లక్ష్మీ పేరున 7 గుంటల భూమి ఉందన్నాడు. కొత్తగా వచ్చిన డిజిటల్ పాసు పుస్తకంలో విస్తీర్ణం తప్పుగా రావడంతో అధికారులు మూడేళ్ల క్రితం పాసు పుస్తకం, ఆధార్‌కార్డులను తీసుకుని సరిచేశారని తెలిపాడు. అప్పటి నుంచి భూమి ఇతరుల పేరు మీద ఆన్‌లైన్‌లో కనిపిస్తుందన్నాడు.

హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

బిచ్కుంద: రామరాజ్యం పేరుతో పేదల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాల రాస్తున్నాయని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బిచ్కుంద మండలంలో గుండె నెమలి, పుల్కల్ మీదుగా బిచ్కుంద వరకు బీఎస్పీ చేపట్టిన పాదయాత్రలో సోమవారం ఆయన పాల్గొన్నారు. అనంతరం బిచ్కుందలో విలేకరులతో మాట్లాడారు. కంటి వెలుగు పథకం ఎన్నికల సమయంలో గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. కొండ పోచమ్మ సాగర్ కాలువ ప్రారంభించిన గంటకే కొట్టుకు పోయిందని విమర్శించారు. ప్రభుత్వం చేపట్టిన నాసిరకం పనులకు ఇది నిదర్శనమన్నారు. జుక్కల్ నియోజక వర్గంలో నిజాంసాగర్ ప్రాజెక్ట్ ఉన్నా ఇక్కడి ప్రజలకు చుక్క నీరు అందడం లేదన్నారు. మైనింగ్ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్న అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బాలరాజ్, సాయిలు, గంగారాం, సురేష్‌గౌడ్, ప్రజ్ఞసాగర్, తుకారం, బోగడ మీది సాయిలు పాల్గొన్నారు.

'గూండాయిజాన్ని పెంచి పోషిస్తున్న బీఆర్ఎస్'

వర్ని: రాష్ట్రంలో గూండాయిజాన్ని, రౌడీయిజాన్ని బీఆర్ఎస్ పెంచి పోషిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వ లక్ష్మీనర్సయ్య ఆరోపించారు. సోమవారం మండలంలోని జలాల్పూర్‌లో ప్రజా గోస- బీజేపీ భరోసా కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇకనుంచి ఎవరైనా బీజేపీ కార్యకర్తలపై దాడులు చేస్తే ఊరుకోమన్నారు. కార్యకర్తలకు తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన కొనసాగుతుందని, ఈ విషయాలను గ్రామాల్లో ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్యాద్రిరెడ్డి, హుస్సేన్, శంకర్, గోవర్ధన్, రమేష్, జనార్దన్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

కొడుకును చంపారనే కోపంతో..

- నిందితుడిపై దాడి
- కత్తిపోట్ల ఘటనలో ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్

ఖలీల్‌వాడి: కొడుకును హత్య చేసిన వారిని ఎలాగైనా చంపాలని తండ్రి కక్ష పెంచుకున్నాడు. ఇందులో భాగంగా ఒకరిపై కత్తితో దాడి చేయగా బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. ఏసీపీ కిరణ్‌కుమార్ సోమవారం వెల్లడించిన వివరాలు.. నగరానికి చెందిన చాట్ల గోపి అలియాస్ షాపురం గోపి కుమారుడు శివ జనవరిలో హత్యకు గురయ్యాడు. మానే శివకుమార్‌తో పాటు మరో నలుగురు శివను చంపారని, వారిని చంపాలని గోపి పథకం పన్నాడు. ఇందులో భాగంగా అతడి స్నేహితుడు మన్నె ప్రకాశ్ సాయంతో ఈ నెల 16న సుభాష్‌నగర్‌లోని నిర్మలాహృదయ స్కూల్ చౌరస్తాలో మానే శివకుమార్‌పై కత్తితో దాడి చేశాడు. శివకుమార్ తప్పించుకొని పారిపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు మూడో టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం హమాల్‌వాడిలో నిందితులు గోపి, ప్రకాష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. నిందితులు వినియోగించిన కత్తి, మోటార్ సైకిల్, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసును చేధించిన పోలీసులను ఏసీపీ అభినందించారు. సమావేశంలో టౌన్ సీఐ వెంకటనారాయణ, ఎస్సై శ్రావణ్ కుమార్, ఎస్సై రామకృష్ణ, ఏఎస్సై రాములు, కానిస్టేబుల్ ఆఫ్సర్, వెంకట్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

హార్వెస్టర్ ఢీకొని మృత్యువాత



ప్రేమ్‌దాస్(ఫైల్)

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్ శివారులో జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం రాంగ్‌రూట్‌లో వస్తున్న హార్వెస్టర్ ఢీకొనడంతో ఇందల్వాయి తండాకు చెందిన బాదావత్ ప్రేమ్‌దాస్ (45) మృతి చెందాడు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇందల్వాయి తండాకు చెందిన ప్రేమ్‌దాస్ పోచంపాడ్‌కు వెళ్లి బైక్‌పై తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో అర్గుల్‌లో శివారులో జాతీయ రహదారిపై రాంగ్‌రూట్‌లో వచ్చిన హార్వెస్టర్ ఢీకొంది. ప్రేమ్‌దాస్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య శాంత, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె..

దోమకొండ: మండలంలోని చింతమాన్‌పల్లిలో సోమవారం పాగాకు రాజయ్యకు చెందిన గేదె విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామ శివారులోని వ్యవసాయబావి వద్ద గడ్డి మేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై చనిపోయిందన్నారు. గేదె విలువ రూ.50 వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు.

పశువుల చోరీ కేసులో ఐదుగురి అరెస్ట్

రుద్రూర్: రుద్రూర్ పోలీస్ సర్కిల్ పరిధిలో పశువుల దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రుద్రూర్ మండలం సులేమాన్‌నగర్, వర్ని మండలం సైదిమల్, పోతంగల్ మండల కేంద్రంలో పశువులు దొంగలించి తప్పించుకు తిరుగుతున్నారు. మూడు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో వరుసగా గెదేల చోరీలు జరుగుతున్నందున నిఘా పెట్టి పోలీసులు ఎట్టకేలకు పోతంగల్ గ్రామానికి చెందిన సయ్యద్ మోసీన్, బాబా కురేషీని అదుపులోకి తీసుకుని విచారించగా మరో ముగ్గురితో కలిసి గెదేలు దొంగలించినట్లు అంగీకరించారు. వీరి వద్ద నుంచి రూ.2.11 లక్షలు స్వాధీనం చేసుకుని రిమాండ్ చేసినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

క్రైం కార్నర్

కొడుకును హత్య చేసిన తండ్రికి జీవితఖైదు

ఖలీల్‌వాడి: పది నెలల కుమారుడిని హత్య చేసిన తండ్రికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల సోమవారం తీర్పు వెల్లడించారు. నగరంలోని మూడో టౌన్ పోలీసులు కోర్టుకు సమర్పించిన అభియోగాల ప్రకారం సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేసిన సెషన్స్ కోర్టు తీర్పు చెప్పింది. కేసు వివరాలు.. నగరంలోని దుబ్బ ప్రాంతంలోని ఎస్ఆర్‌టీ క్వార్టర్స్ చెందిన కతుల్వార్ కృష్ణవేణి, బాలాజీ భార్యాభర్తలు. వీరికి 10 నెలల కుమారుడు ప్రశాంత్ ఉన్నాడు. బాలాజీ మద్యం తాగి భార్యతో గొడవ పడేవాడు. భార్యకు వివాహేతర సంబంధాలు అంటగడుతూ వేధించేవాడు. 2014 ఆగస్టు 7న రాత్రి భార్యతో గొడవపెట్టుకుని కోపంతో పదినెలల కొడుకును నేలకేసి కొట్టాడు. దీంతో బాలుడు చనిపోయాడు. హత్య నేరం రుజువు కావడంతో ముద్దాయి బాలాజీకి జీవిత ఖైదుతోపాటు రూ.రెండు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవిరాజ్ వాదించారు.

కుక్కల దాడిలో బాలుడి మృతి



ఇందల్వాయి: ఇందల్వాయికి చెందిన ఐదేళ్ల బాలుడు హైదరాబాద్‌లో ఆదివారం కుక్కల దాడిలో గాయపడి మృతి చెందిన ఘటన స్థానికులను విస్మయానికి గురిచేసింది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన గంగాధర్ హైదరాబాద్‌లోని ఓ కార్ షోరూంలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. అయితే ఆదివారం తన ఐదేళ్ల కుమారుడు ప్రదీప్‌ని కూడా వెంట తీసుకెళ్లాడు. ఈ క్రమంలో అక్కడ ఆడుకుంటున్న ప్రదీప్‌పై కుక్కలు దాడిచేసి గాయపర్చడంతో ప్రదీప్ మృతి చెందినట్లు వారు తెలిపారు.

పొయ్యి వెలిగిస్తుండగా అంటుకున్న మంటలు

- చికిత్స పొందుతూ వివాహిత మృతి

రెంజల్: కట్టెల పొయ్యి వెలిగిస్తుండగా మంటలు అంటుకొని గాయపడ్డ వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై పండ్ల సాయన్న తెలిపిన వివరాలు.. మహారాష్ట్రకు చెందిన స్వాతి(21), ప్రసాద్ దంపతులు కూలీ పనులు చేసుకోడానికి రెంజల్‌కు వలస వచ్చారు. రెంజల్ శివారులో ఉంటున్నారు. ఈ నెల 14న స్వాతి డీజిల్ పోసి కట్టెల పొయ్యి వెలిగించే క్రమంలో మంటలు అంటుకుని తీవ్రంగా గాయపడింది. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందింది. భర్త ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి..

జక్రాన్‌పల్లి: మండలంలోని బాలానగర్ తండా వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మీసాల దశరథం(44)సోమవారం మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. డిచ్‌పల్లి మండలంలోని ఘన్‌పూర్ గ్రామానికి చెందిన మీసాల దశరథం ఆర్మూర్‌లో చేపలు తీసుకురావడానికి టీవీఎస్ ఎక్సెల్‌పై బయలు దేరాడు. బాలానగర్ జాతీయ రహదారిపై వెనుక నుంచి వచ్చిన అశోక్ లీలాండ్ వాహనం ఢీకొట్టింది. గాయపడ్డ దశరథంను నిజామాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ దశరథం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

రెండు దుకాణాల్లో చోరీ

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద గల ఆర్కె కాంప్లెక్స్‌లో ఆదివారం దొంగలు పడ్డారు. కాంప్లెక్స్‌లోని సాయికృప ఆన్‌లైన్ సెంటర్, సాయి మీ సేవ సెంటర్‌ల తాళాలను ధ్వంసం చేసి రెండు దుకాణల్లో రూ.6వేల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. అలాగే ఓ బట్టల దుకాణం తాళాలను ధ్వంసం చేశారు. ఎస్సై రాము ఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు.

పట్టపగలే దొంగతనం

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో సోమవారం పట్టపగలే తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేస్తున్న లక్ష్మి ఉదయాన్నే ఇంటికి తాళం వేసి పాఠశాలకు వెళ్లింది. మధ్యాహ్నం తిరిగి వచ్చి చూసే సరికి తాళం పగుల గొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న ఐదు తులాల బంగారం, నగదును ఎత్తుకెళ్లినట్లు గమనించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై గణేష్ అక్కడికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. బాధితురాలు తమకు లిఖిత పూర్వక ఫిర్యాదు చేయలేదని ఎస్సై గణేష్ తెలిపారు.

ఇద్దరిపై పీడీ యాక్ట్ నమోదు



పీడీయాక్ట్ నమోదు పత్రాలను అందజేస్తున్న పోలీసులు

కామారెడ్డిటౌన్: ఒక మహిళ నుంచి బంగారు ఆభరణాలు, నగదు దొంగిలించి చంపేసిన ఇద్దరిపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం తెలిపారు. వారికి పీడీ యాక్ట్ ఉత్తర్వులు అందజేసి చంచల్‌గూడ జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. వివరాలు.. గతేడాది సెప్టెంబర్‌లో కామారెడ్డికి చెందిన ఒక మహిళ వద్ద నుంచి బంగారు ఆభరణాలు, నగదు దొంగిలించి గాంధారి మండలం తిమ్మాపూర్ శివారులోకి తీసుకు వెళ్లి కాల్చి వేశారు. వీరిపై గాంధారి ఠాణాలో పలు కేసులు నమోదు అయ్యాయి. కామారెడ్డి చెందిన ఏ1 నిందితుడు వీరమల్లు రమేష్, అతని భార్య ఏ2 నిందితురాలు వీరమల్లు యశోద అలియాస్ హారికను అరెస్టు చేసి కోర్టుకు పంపామన్నారు. వారు బెయిల్‌పై విడుదల కాగా పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి ఉత్తర్వులను అందజేశామన్నారు. నిందితులకు సదాశివనగర్ సీఐ రామన్ పీడీ యాక్ట్ ఉత్తర్వులు అందజేశారు.

గంజాయి స్వాధీనం



బోధన్‌లో పట్టుకున్న గంజాయితో అధికారులు

బోధన్‌టౌన్: బోధన్ పట్టణంలోని రాకాసీపేట్ కాలనీలో సోమవారం ఎక్సైజ్ అధికారులు మోతుకూరి వెంకట్ వద్ద నుంచి 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ రూప్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని రాకాసీపేట్ కాలనీలో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేయగా వెంకట్ పట్టుబడ్డాడు. నిందితుడిని అదుపులోకి తీసుకొని గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ఖలీల్‌వాడి: నగరంలోని బాబాన్‌సాహెబ్‌పహాడ్ వద్ద ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించగా షైక్ హాజీ వద్ద 650 గ్రాముల గంజాయి దొరికినట్లు నగర ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో మధుసూదన్ తెలిపారు. గంజాయిని తరలిస్తున్న బైక్‌ను స్వాధీనం చేసుకొని, షైక్‌హాజీని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. ఎక్సైజ్ ఎస్సై మల్లేష్, కానిస్టేబుళ్లు షబ్బీర్, ప్రభాకర్, సంగయ్య, రవి, మోహన్ సింగ్ పాల్గొన్నారు.

కాలూర్‌లో కల్లు శాంపిళ్ల సేకరణ

నిజామాబాద్ రూరల్ మండలం కలూర్ కల్లు డిపోలో కల్లుసీసాలో ఎలుక రావడంతో శాంపిళ్లు సేకరించినట్లు ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో మధుసూదన్ తెలిపారు. రిజల్ట్ వచ్చిన తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

నవీపేట: మండలంలోని అబ్బాపూర్(ఎం)లో ఆదివారం రాత్రి అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరి దగ్గర నుంచి 120 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్సై సింధు సోమవారం తెలిపారు. కల్లు బట్టీలో కల్లు తాగేందుకు వెళ్లిన్న ఎడపల్లి మండలం నెహ్రూనగర్‌కు చెందిన షేక్ ఇంతియాజ్, నవీపేటలోని ధర్యాపూర్‌కు చెందిన పురుషోత్తం దగ్గర తనిఖీలు చేయగా ఈ గంజాయి లభించినట్లు పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేశామని తెలిపారు.

రెస్టారెంట్‌పై దాడి

నవీపేటలోని ఓ రెస్టారెంట్‌లో ఆదివారం రాత్రి దాడి చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై సింధు తెలిపారు. అనుమతులు లేని రెస్టారెంట్‌లో నిషేధిత మద్యం తాగుతున్న స్టేషన్ ఏరియాకు చెందిన వీరేందర్‌పై కేసు నమోదు చేశామన్నారు.

చెట్టును ఢీకొన్న ప్రైవేట్ స్కూల్ బస్సు

- విద్యార్థులకు స్వల్పగాయాలు



కామారెడ్డి టౌన్: కామారెడ్డి మండలం లింగాయిపల్లి శివారులో ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు చెట్టును ఢీకొంది. పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూల్‌కు చెందిన బస్సు సాయంత్రం స్కూల్ సమయం ముగిశాక విద్యార్థులను తీసుకుని బయలుదేరింది. లింగాయిపల్లికి వెళ్తుండగా గ్రామ శివారులో అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 30 నుంచి 40 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రమాదంలో పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలు అయ్యాయి. విద్యార్థుల అరుపులు విని స్థానికులు బస్సు వద్దకు చేరుకుని విద్యార్థులను క్షేమంగా బయటకు తీసుకువచ్చారు. దేవునిపల్లి పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.